# శ్రీ రమణ జ్యోతి / Sri Ramana Jyothi

జూలై 2019 / July 2019


ఈ సంచికలో ... / IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| 1. | **డా॥ కే.యస్. గారి 60వ ప్రవచనం** | తాడిమేటి సత్యనారాయణ | 3 |
| 2. | **శ్రీ భగవాన్ సేవలో** | జి. శ్రీహరి రావు | 12 |
| 3. | **పంచకోశవిశ్లేషణ** | డా. వి. రామదాస్ మూర్తి | 19 |
| 4. | **శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు** | జి. శ్రీహరి రావు | 26 |
| 5. | **Means Is As Important As The Goal** | Dr.K.Subrahmanian | 30 |
| 6. | **Sri Ramana Chatvarimsat-Verse 5** | V. Krithivasan | 35 |
| 7. | **Lest We Forget**<br>**My father, Sri G.V. Rajeswara Rao** | G. SriHari Rao | 38 |
| 8. | **AksharaManaMalai** | Nadhia Sutara | 43 |
| 9. | **Saints of Periapuranam**<br>**Amarneeti Nayanar** | | 48 |
| 10. | **In the Service of the Lord** | | 51 |


## Events in Sri Ramana Kendram in July

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 3rd & 31st July - Punarvasu Satsang - 6.00 - 7.15 p.m.


© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyoti either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.



**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు : కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**


# శ్రీ మణి గారి భాషణ

డా॥ కే.యస్. గారి 60వ ప్రవచనం రెండవ భాగము

తెలుగు అనువాదం: తాడిమేటి సత్యనారాయణ

## ఆనందంగా వుండేందుకు ప్రయత్నాలు

మనం ఎన్నో ప్రవచనాలను వింటాము. ఎందరితోనో మాట్లాడతాము. పుణ్య స్థలాలను దర్శిస్తాము. ఆలయాలకు వెళతాము. సాధువులను, మహాత్ములను, యోగులను సేవిస్తాము. ఇవన్నీ మనం ఎందుకు చేయాలి? ఇలా చేయడం వల్ల శాంతి లభిస్తుందని భావిస్తాము. కొత్త విషయాలు తెలుస్తాయని ఆశిస్తాము. ఇన్ని చేసినా అప్పటికి శాంతి లభించవచ్చు. కొంత శాంతి లభించినా తిరిగి మనలో అశాంతి రేగి ఎవరినో ఆశ్రయించాలని యత్నిస్తాము.

అసలు సంతోషానికి ఆధారం ఏమిటి, అని ప్రశ్నించుకోము. చిన్నతనంలో పెద్దలు చెబితే నేర్చుకొన్నదే ఈనాటికీ వర్తిస్తుంది. ఇపుడు యోగులు, సాధువులు కొత్తవి ఏవైనా చెబుతారా? మనం నేర్చుకొన్న విషయాలనే మరొక విధంగా చెబుతారు. కారణం మనం నేర్చుకున్నవి ఆచరణలో పెట్టలేదు. మనం భగవద్గీత చదువవచ్చు. భగవద్గీత కూడ మన బాల్యంలో పెద్దలు చెప్పిన విషయాలనే చెబుతుంది. వయసు వచ్చాక మనం ఎన్నో బయటి వ్యవహారాల్లో మునిగిపోయి మౌలిక విద్యను మరచి పోయాము. అంతేగాని కొత్తగా నేర్చుకొనేవి ఏమీ లేవు. భగవద్గీతను పఠిస్తే, అది నిజాయితిగా లేకుండ అవిధేయతతో, అసత్యంగా జీవించమని చెబుతుందా? కాని ఒక వయస్సులో ఈ

అవిధేయతతో నిజాయితీ లేకుండ అసత్యంగా జీవిస్తే విజయం సాధించగలమా అన్న ఆలోచన వస్తుంది. అంతే కాకుండా అలా జీవిస్తే ఆనందంగా ఉండగలమా? కాని కొందరు ఇప్పటికీ అలాంటి జీవితాన్ని గడుపుతూనే విజయం సాధించారే అని ఆశ్చర్యపోతాము. అలాంటివాళ్లు నిజంగా, ఆనందంగా ఉన్నారా? ఈ ప్రశ్నకు సమాధానం దొరకదు.

మనలో మరొక వర్గం వారున్నారు. ఒకపూట భోజనం ఎక్కడ, ఎప్పుడు దొరకుతుందో వాళ్ళకు తెలియదు. కాని వారి దగ్గరికి ఎందరో వెళ్లడానికి ఇష్టపడతారు. ఆశ్చర్యమనిపిస్తుంది. వాళ్లు తమవద్దకు రమ్మని ఎవరినీ అడుగరు. అయినా వారిని ఆశ్రయిస్తారు. ఎందుకు? అని అడిగితే ఎందరో పోతున్నారు నేనూ పోతున్నానంటారు. కొంత శాంతి లభిస్తుంది వారి సమక్షంలో అంటారు. ఏమయినప్పటికీ ఆనందం కావాలంటే అందరిలాగ నేనూ ఉండాలి. కాని గురువు ఒకరు కావాలనుకొంటాం. నా సమస్యలకు ఆ గురువు పరిష్కారాలను సూచిస్తారని భావిస్తాం. గురువు పట్ల మనకున్న వైఖరి అదే. గురువు ఎంతో కరుణ చూపిస్తారు కాబట్టి, నా సమస్యల నుండి నన్ను కాపాడుతారు అన్నదే మనందరి వైఖరి.

## ఉద్దేశం మంచిదైనా కష్టాలు తప్పవు

భగవాన్ గుర్వాజ్ఞను పాటించమంటారు. అది కొంత కష్టమే అయినా, ఇష్టము కాని పని అయినా సరే, గుర్వాజ్ఞను పాటించా లంటారు. అంతేకాదు, వాటి పర్యవసానాలు ఏమయినప్పటికీ గురువు మాటను పాటించాలి. ఆ పని మంచి కొరకే యని



గుర్తించాలి. ఉదాహరణకు ఒక ఆలయం నిర్మించాలనుకోవటం మంచి సంకల్పమే. పని ప్రారంభించిన తర్వాత, కావలసిన ధనం ఎట్లాగ లభిస్తుందని చింతించకూడదు. భక్త రామదాసు ఆలయాన్ని నిర్మించాలని సంకల్పించారు. భగవత్కార్యము కాబట్టి, తన సొంత పైకము కానిదయినా పరాయి సొమ్మును ఒక శుభకార్యానికై వెచ్చించారు. ఈ కార్యం నా కోసమే చేశాడు కాబట్టి రామదాసుని ఎట్లయినా రక్షిస్తానని శ్రీరాముల వారు అనలేదు. రామదాసు చివరకు చెరసాలలో బంధింపబడ్డారు. తర్వాత అతడు ఎట్లాగ రక్షింపబడ్డాడన్నది వేరే విషయం. రామదాసు చేసిన పనికి చెరసాల శిక్ష అనుభవింపక తప్పలేదు.

సీతమ్మవారు సాక్షాత్తు లక్ష్మీదేవి. ఈ విశ్వానికి తల్లి. అయినా వారు ఎంతో కష్టపడ్డారు. రావణుడు ఆమెను అపహరించాడు. శ్రీరాముని నుండి ఒక సంవత్సర కాలం సీతమ్మవారికి ఎడబాటు తప్పలేదు. ఒక్కరోజులో సీతమ్మవారిని శ్రీరాముడు విడిపించ లేరా? కాని వారలా చేయలేదు. ఆమె కష్టాలు అనుభవింపక తప్పలేదు. ఇంతకీ ఆమె చేసిన నేరమేమిటి? సీతమ్మకు కలిగిన కష్టాలు మనకూ కలగవచ్చు. ఇవన్నీ మానవాళికి పాఠాలే కాని సీతమ్మ వైఖరి వేరు. లక్ష్మణుని కఠినమైన మాటలతో తూలనాడింది. లక్ష్మణుడు గుణశ్రేష్ఠుడు (శ్రీ వాల్మీకి రామాయణం, కిష్కింధాకాండం, 6వ సర్గ, 22వ శ్లోకం) ''నాహం జానామి కేయూరే, నాహం జానామి కుండలే, నూపురే త్వభిజానామి, నిత్యం పాదాభివందనాత్'' అని పల్కిన లక్ష్మణుడు గుణ సంపన్నుడు. సుగ్రీవుడు శ్రీరామునితో ''కొన్నాళ్లకు పూర్వం

రాక్షసుడు ఒకడు ఒక స్త్రీని అపహరించి తీసుకొని పోయాడు. అపుడు ఆమె తన ఆభరణాల మూటను క్రిందకు విసిరింది. నేను వాటిలో కొన్నింటిని తీసిపెట్టాను. వీటిని చూసి, ఇవి సీతమ్మ వారివాయని నిర్ణయించండి'' అన్నాడు. శ్రీరాముడు ఆ మూటను విప్పి చూశాడు. వెంటనే ఆయన కళ్లు చెమర్చినాయి. అశ్రువులు నిండిన కళ్లతో మూటలోని ఆభరణాలను చూడలేక పోయారు. అవి సీతమ్మవేయని భావించారు. అపుడు లక్ష్మణుని చూసి ''ఇవి సీత ఆభరణాలేనా? చూడు'' అని అడిగారు.

ఒక స్త్రీని గౌరవించడం మన సంస్కృతిలోనే తప్ప లోకంలో మరెక్కడా కనిపించదు. పై శ్లోకానికి సంబంధించిన ఘట్టాన్ని జాగ్రత్తగా పరిశీలించినట్లయితే, మనం కంట తడిబెడతాము. ఈనాడు ఏ స్థితికి దిగజారామో తెలుస్తుంది. లక్ష్మణుడు అంటాడు ''గాజులు గురించి నాకేమి తెలుసును? అవి సీతమ్మ వారివని కూడా నాకు తెలియదే! కుండలములా? కేయూరమా? ఆమెవా? నాకు తెలియదే! ఎందుకంటే నిత్యం ఆమె పాదాలను మ్రొక్కినపుడే నూపురాలను చూసేవాణ్ణి. అంతే. ఆమెను నేను ఎన్నడూ తలెత్తి చూడలేదే! ఆమె పాదాలనే చూచి దర్శించేవాడిని తప్ప మరేమి ఎరుగను. శ్రీరామా! కేవలం నూపురములనే చూచేవాణ్ణి. ఇక కుండలముల గురించి అంటారా, వాటి గురించి నాకేమీ తెలియదు'' ఇది లక్ష్మణుని వైఖరి. శ్రీరాముడు మారీచుని బాణంతో కొట్టినప్పుడు, మారీచుడు ''ఓ సీతా! ఓ లక్ష్మణా యని బిగ్గరగా అరచాడు'' వెంటనే సీతమ్మ ''శ్రీరామునికి ఏమి జరిగినదో చూసిరా'' అని లక్ష్మణునితో అన్నది. ''నా రామునికేమీ జరుగదు. ఎవరూ ఆయనను ఏమి చేయలేరు'' అన్నాడు. ఎన్నిమార్లు



లక్ష్మణుని వెళ్లి చూసిరమ్మన్నా, లక్ష్మణుని సమాధానమంతే. కాని సీతమ్మ ఆగ్రహపూరితురాలయి లక్ష్మణుని కఠినమైన మాటలతో తూలనాడింది. ఈ మాటలు విన్న లక్ష్మణుడు, ఎన్నడూ ఆమె వంక చూసి ఎరుగని లక్ష్మణుడు, శ్రీరాముని దైవం వలె చూచిన ఆ లక్ష్మణుడు చిగురుటాకులాగ తల్లడిల్లి పోయాడు. వెంటనే వెళ్తానని నిశ్చయించి ఆమె ముందు ఒక రేఖ గీస్తాడు. అదే లక్ష్మణ రేఖ అయింది. సీతమ్మతో ''అమ్మా! శ్రీరామునికి ఎట్టి ఆపద రాదని నాకు బాగా తెలుసును. మీరు ఈ రేఖను దాటకండి. మీ కఠినమైన మాటలను వినలేను కనుక పోయి చూచి వస్తానని'' అన్నాడు. ఒక విషయం మనం ఇక్కడ గుర్తించాలి. ఆమె ఈ భూమికి తల్లి. ఆమె వాడిన కఠినమైన మాటలు ఆమెకే గ్రుచ్చుకొన్నాయి. అంతేకాక, లక్ష్మణుడు, రాముడు కలిసే సీతమ్మను రక్షించారు. లక్ష్మణుని గొప్ప గుణమేమంటే, ఆమె అనిన కఠినమైన మాటలను మరెవ్వరితోనూ చెప్పలేదు. ఈ సంఘటన నుండి మనం నేర్చుకోవలసిందొకటే. మనం చేసిన పనులకు ఫలితాన్ని అనుభవింపక తప్పదు. చేసిన పనికి పశ్చాత్తాపమే దానికి ప్రాయశ్చిత్తం.

### ఆలోచనా బలం

గమ్యం ఏమయినప్పటికీ మనం అనుసరించే విధానం మంచిదై వుండాలి. మనం సంతోషంగా వుండాలంటే, ఇతరులకు మన సంతోషాన్ని పంచాలి. పరుషమైన మాటలు, అహంభావం, ద్వేషం ఇలాంటివి పనికి రావు. ఇతరులకు సంతోషాన్ని పంచితే మనకూ సంతోషంగా వుంటుంది. ఎట్టి లాభాలనూ ఆశించకుండ

ఇతరులకు సహాయపడితే మనకు సంతోషం కల్గుతుంది. అవతలి వాళ్ళను ఆనందపరిచేందుకు ఎన్నో మార్గాలున్నాయి. కొందరు రాత్రిపూట బయటికి వెళ్లి పేదలకు తోచిన డబ్బు ఇస్తారు. దాత ఎంతో సంతోషపడతాడు. తీసుకొన్నవారు దాత గురించి చెప్పుకొంటారు. చేసే పని ఏదయినా గుట్టుగా చేయాలి. అటుపై ఇతరుల నుండి ఏదీ ఆశించడు. ఇచ్చినవారికి ఆనందాన్నిస్తుంది. అలాంటి వైఖరినే మనం అనుసరించాలి. మన చుట్టూ వున్న వ్యక్తులు, వారి కుటుంబ సభ్యుల గురించి మనలో ఎంతమందికి తెలుసును? వారి బాగోగుల గురించి ఏ మాత్రమయినా ఆలోచిస్తామా? కనీసం అడిగి తెలుసుకొంటామా? అలాటి వైఖరిని మనం ప్రదర్శిస్తే ఇతరులలో ఎంతో మార్పు కనిపిస్తుంది. సత్సంబంధాలను పెంచుతుంది. ఇతరులు సంతోషంగా ఉండాలని ఆలోచించినా సరే అది ఎంతో ఫలితాన్నిస్తుంది. ఆలోచనా తరంగాలకు అంతటి అద్భుతమైన శక్తి వుంది. లబ్ధిదారులు కూడా ఇలాగ జరిగిందని మనతో చెప్పుకొంటారు. ఇది అసాధారణమని భావించవచ్చు, కాని ఇది నిజం.

ఎక్కడో ఇతర దేశాలలో ఎవరో పాటలు పాడటం రేడియో ద్వారా మనం వినడం లేదా? మనం కూర్చొనే స్థలం చుట్టూ వున్న ఈ లోకంలో శబ్దతరంగాలున్నాయి. కాని మనం వినలేక పోతున్నాము. దానికి రేడియో కావాలి. రేడియో ద్వారా ఎన్నో వినగల్గుతున్నాము. అట్లాగే మనం కూడా నిశ్శబ్దంలో మన ఆలోచనా తరంగాలను ప్రసరింప జేయవచ్చు, మన ప్రార్థనలే దానికి నిదర్శనం. మన తలపులు ఎప్పుడూ శుద్ధమయినవిగా ఉండాలి. అంటే "ఈ రోజు నేను ఎవరికి ఏమి చేయగలను?"



అని ఆలోచించాలి. మనం చేసే పనిగాని, మంచి ఆలోచనలను గాని ఇతరులతో చెప్పాల్సిన అవసరం లేదు. సూర్యుడు నిత్యం మనకు వెలుగునిస్తున్నాడు, కాని మన నుండి ఏదీ ఆశించడు. కాని అసలు సూర్యుడు ఒకడున్నాడని కూడా మనం పట్టించుకోము.

యోగులు, ఋషులు పరుల క్షేమం గురించే ఆలోచిస్తారు. దీని నుండి మనం ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు. ఇతరుల సుఖ సంతోషాల గురించి మనం పట్టించుకొంటే మనం కూడా సంతోషంగా ఉంటాము. ఇదే మనకు ఒక పాఠం. కేవలం నేను, నా కుటుంబం, నా సంతానం గురించి ఆలోచిస్తే అది కొంత కాలమే ఆనందాన్నిస్తుంది. ఇతరుల క్షేమం గురించి ఆలోచించిన వానికి మాటలలో వివరించలేని ఆనందం భగవంతుడు ఇస్తాడు. ఇలాంటి ఆనందం గ్రంథపఠనాల ద్వారా లభించదు. భగవాన్ రమణులు, శ్రీరామకృష్ణ పరమహంస వీరు దేహధారులై వున్నంత కాలం వారి ఆలోచనలన్నీ ఇతరుల క్షేమం కొరకే వెచ్చించేవారు. ఇతరుల నుండి వారేమీ ఆశించలేదు. అట్లాగే మనం కూడా కొద్దో గొప్పో చేయొచ్చు కదా! ఇది భగవదనుగ్రహం వలనే సాధ్యమవుతుంది.

## తోటివారికి సహాయం

శ్రీరాములవారి సుగుణం కృతజ్ఞతాభావం. కృతజ్ఞతాభావమంటే బయటివారితో మాత్రమేగాక, మనింట్లో వారిపట్ల కూడా ఆ భావాన్ని చూపాలి. ఇంట్లో వారు "చేయక ఏం చేస్తారులే" అనే అల్పభావం వుంటుంది. గృహిణి రోజంతా శ్రమించి చేసే

పనులకు, వహించే బాధ్యతలకు యజమాని కృతజ్ఞతను వెలి బుచ్చాలి. ఉద్యోగస్తులు శలవు తీసుకొంటారు. కాని గృహిణులకు శలవు ఏది? జీవితమంతా తమ కుటుంబానికై శ్రమించాలి. ఒక్క రోజు ఆమె అస్వస్థతకు గురి అయితే కుటుంబ సభ్యులందరూ ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటారు. అదే ఇంటి యజమాని అనారోగ్యంతో వుంటే కుటుంబసభ్యులందరూ అతనికి సహాయపడి సపర్యలు చేస్తారు. ఇవన్నీ చిన్న విషయాలు కావు. ఇంట్లో ప్రతి ఒక్కరు ఏదో ఒక పని చేయాలి. కుటుంబానికై ఆ కాస్త పని చేసినందుకు సంతోషంతో వారిని అభినందించాలి. అనేక కుటుంబాలలో సంతోషం లేకపోవడానికి కారణం ఇదే. గృహిణియే మనకు అన్నీ అందించాలని అనుకోవద్దు. మీరే వెళ్లి కావలసినవి తీసుకొంటే, గ్లాసులు, పళ్ళేలు శుభ్రం చేస్తే మనకు ఎంతో తృప్తిగా ఉంటుంది. అంతేగాకుండ కుటుంబ సభ్యుల మధ్య ఎట్టి తారతమ్యాలుండవు. ఇదే మనం భగవాన్ నుండి నేర్చుకొనవలసినది. భగవాన్ తన పనులను ఎవరి చేతను చేయించుకొనేవారు కాదు. ఇతరులకు వారే చేసేవారు. జ్ఞానికీ ఒక సామాన్యునికీ గల తేడా ఇదే.

భగవాన్ వంటశాలకు వెళ్లి వంటలు చేసేవారు భక్తులందరికీ. వారు మనందరికీ ఒక ఉదాహరణ. వంటశాలలో వంట చేసే వితంతువులు "మేమెల్లప్పుడూ వంటింటికే పరిమిత మవ్వాలా? ఇతరులలాగ మేము హాలులో ధ్యానం చేసుకోలేమా? జీవితమంతా ఈ వంటశాలకే అంకితమయి పోవాలా?" యని ప్రశ్నించుకునేవారు. భగవాన్ వారిని సమాధానపరుస్తున్నట్లు, తెల్లవారుఝామున నాలుగు గంటలకే వంటశాలలో పని



ప్రారంభించేవారు. అక్కడి వారితో "మీరు ఎంత గొప్ప సేవ చేస్తున్నారో తెలుసా? మీ వల్ల ఈ సమాజానికి ఉపయోగం లేదని భావించవద్దు. మీరు చేసే సేవ ఎంతో ఉత్కృష్టమయినది" అనేవారు భగవాన్. వంటశాలలో పనిచేసే వారందరూ అబలలు, పేదలు. ఎంతో కరుణతో భగవాన్ వంటశాలలో పనిచేసే భక్తుల వద్దకీ వెళ్లేవారు. వారితో సంభాషించేవారు. వారికి బోధించేవారు. ఇందులో కొంత ఉప్పు వేయి, నిమ్మకాయ వూరగాయ ఇలాగ చేయాలి అని మాట్లాడుతూ చేయించేవారు. వారందరూ ఎంత అదృష్టవంతులో! ఇతరులందరూ భగవాన్‌ను వెదకి వెళ్లేవారు, భగవాన్ కరుణతో తామే వంటశాల పనిచేసే వారి దగ్గరకు వెళ్లేవారు. ఇదే వారు మనకు నేర్పిన పాఠాలు. కొందరు వంటింట్లో సరకులు లేవనేవారు. "సరే నేను వచ్చి చూస్తాను" అనేవారు భగవాన్. వెళ్లి చూడగానే కొద్ది మాత్రంగా బియ్యం ఉండటాన్ని చూశారు భగవాన్. అటుపై ఒక వింత జరిగింది. భగవాన్ కటాక్ష వీక్షణం పడగానే కావలసిన దానికంటే ఎక్కువ ఆహారం తయారయ్యేది. భగవాన్ "నీవు వంట చేస్తున్నావనుకోవద్దు. చేతులు వంటపై మనస్సు భగవంతునిపై ఉండాలి" అనేవారు.

భగవాన్ స్కందాశ్రమం నుంచి ప్రస్తుతపు ఆశ్రమానికి మన కోసమే వచ్చారు. లేకుంటే, వృద్ధులు, ఇతర భక్తులు వారి దర్శనానికై కొండమీదకు పోవడానికి కష్టపడి వుండేవారు. ఆదిశంకరులు తమ పిన్న వయసులోనే ఆత్మసాక్షాత్కారం పొందారు. ఆ స్థితిని వారనుభవిస్తూ ఆనందంలో గడిపి వుండవచ్చు. కాని అట్లాగ చేయకుండా, దేశమంతా పర్యటించారు. మతములను స్థాపించారు, బోధించారు. ఎన్నో గ్రంథాలు

రచించారు. అంతా మన కొరకే చేశారు. ముఖ్యంగా సౌందర్య లహరి, శివానందలహరి వంటి గ్రంథాలను భక్తుల కోసం రచించారు. ఈ కార్యక్రమాలలో వారు ఎన్నో శరీర బాధలను అనుభవించారు. వారి కరుణ అట్టిది.

కనుక ఇతరుల సంతోషమే మన సంతోషం. ఇతరుల సంతోషానికి చేసే ఎట్టి కార్యమయినా నిష్కామ్యంగా చేయాలి. అట్లాగ చేసే తాము ఆనందంగా ఉండగలరు.

# శ్రీ భగవాన్ సేవలో

*(గత సంచిక తరువాయి)* - శ్రీ జి. శ్రీహరిరావు

శ్రీ భగవద్గీతలో చెప్పబడిన ఈ శ్లోక భావానికి అనుగుణంగా మసలుకోవడానికి చిన్నస్వామి కృషి చేసారు.

శ్లో॥ **యస్య సర్వే సమారంభః కామ సంకల్పవర్జితః ।**
**జ్ఞానాగ్ని దగ్ధకర్మాణాం తమాహుః పండితం బుధాః ॥**

తా॥ ఎవని చేష్టలు స్వార్థరహితంగా వుంటాయో, ఎవని చేష్టలు జ్ఞానం అనే అగ్నితో పరిశుద్ధమవుతాయో, అటువంటివాడు "ఋషి, బుధజనుడు" అనబడతాడు.

చిన్నస్వామి శ్రీ భగవాన్‌తో చాలా అరుదుగా మాట్లాడేవారు. కానీ, ఏ పనైనా శ్రీ భగవాన్ నుండి ప్రత్యక్షంగాగాని, పరోక్షంగా గాని అనుమతి లేనిదే చేసేవారు కాదు. ఒక సందర్భంలో మాత్రం ఆయన శ్రీ భగవాన్ సమక్షంలోనే చాలా గట్టిగా మాట్లాడారు. శ్రీ భగవాన్‌కు మహాభక్తులైన శ్రీబలరామరెడ్డిగారు ఇలా వ్రాశారు: "ఆశ్రమ నిర్వహణలో శ్రీభగవాన్ సోదరుడు చాలా విమర్శలు



ఎదుర్కోవలసి వచ్చింది. అయినప్పటికీ, శ్రీ భగవాన్ నిరంజనానందస్వామిని తన పనిముట్టుగా వాడుకున్నారు అనడంలో ఎటువంటి సందేహం లేదు. చిన్నస్వామికి ఏ విషయంలో అయినా తన అంతఃసాక్షిగా శ్రీ భగవాన్ సంకల్పం అని తోచినపుడు, ఆ విషయంలో నిస్సంకోచంగా, ధైర్యంగా వ్యవహరించేవారు."

పాల్ బ్రంటన్ వ్రాసిన 'రహస్య భారతంలో శోధన' (ఎ సెర్చ్ ఇన్ సీక్రెట్ ఇండియా) వలన తిరువణ్ణామలైలో ఈ శతాబ్దానికే అద్వితీయుమైన మహానుభావుడు శ్రీరమణ మహర్షి నివసిస్తున్నారనే విషయం యావత్ ప్రపంచానికీ తెలిసింది. బ్రంటన్ వృత్తిపరంగా ఒక రచయిత. ఆ రోజుల్లో ఆయన ఎక్కడకు వెళ్లినా, అక్కడి విశేషాలను చిన్న చిన్న కాగితాలమీద వ్రాసుకొనే వారు. 'ఎ సెర్చ్ ఇన్ సీక్రెట్ ఇండియా', బాగా ప్రసిద్ధి చెందిన తర్వాత ఆయన మరెన్నో పుస్తకాలు వ్రాయటం ప్రారంభించారు. వాటిలో కొన్ని చోట్ల, శ్రీ భగవాన్ బోధనలను తగు గుర్తింపు తెలియపరచకుండా వ్రాయసాగారు. ఆశ్రమ యాజమాన్యానికి ఈ సంగతి తెలియగానే ఆయనను హాలులో వ్రాసుకోవడానికి అనుమతి ఇవ్వకూడదని నిర్ణయం తీసుకున్నారు.

ఒక రోజున, 1939లో, బ్రంటన్ నా (బలరామరెడ్డిగారు) పక్కనే కూర్చొని ఎప్పటి వలె తన జ్ఞాపకార్థం హాలులో జరిగే సంభాషణలు వ్రాసుకుంటు న్నాడు. నిరంజనానందస్వామి ధైర్యంగా లోపలికి వచ్చి, ఇక నుంచి భగవాన్ సమక్షంలో కూర్చొని నోట్సు వ్రాసుకోవడానికి వీలులేదని ఆంగ్లంలో బ్రంటన్‌కు చెప్పమని

మునగాల వేంకట్రామయ్య గారితో అన్నారు. వేంకట్రామయ్యగారివైపు చూస్తూ బ్రంటన్, ''శ్రీ భగవాన్ అభిప్రాయం కూడా ఇదేనా?'' అని ప్రశ్నించారు. వేంకట్రామయ్యగారు సమాధానం చెప్పలేదు. నిశ్శబ్దంగా కూర్చున్న శ్రీభగవాన్ కూడా ఏమీ మాట్లాడలేదు. గంభీరమైన నిశ్శబ్దంతో కొన్ని క్షణాలు గడిచాయి. అపుడు బ్రంటన్ లేచి, హాలు వదిలి వెళ్ళిపోయాడు. అప్పటి నుండి బ్రంటన్ ఆశ్రమానికి దూరమై పోసాగాడు.

శ్రీ భగవాన్ సమక్షంలో సర్వాధికారి తన అధికారం ప్రకటించడం చాలా అనూహ్యమూ, అరుదు. ఆశ్రమాన్ని ఈ విధంగా స్వలాభంకోసం వాడుకోవడాన్ని ఆపాలని ఆయన ఉద్దేశం. శ్రీ భగవాన్ తన భావంతో ఏకీభవిస్తున్నారని ఆయన నమ్మకం.

శ్రీ భగవాన్‌కు శ్రేష్ఠమైన ఆహారం వడ్డించాలి అనేది చిన్నస్వామి కోరిక. భగవాన్ తినే కొద్దిపాటి భోజనం చాలా మేలురకంగా వుండేటట్లుగా చూసేవారు. ఉదాహరణకు నెల్లూరు నుండి మంచి బియ్యం తెప్పించేవారు. ప్రొద్దుటూరు నుండి నెయ్యి, విరుదుపట్టి నుండి పప్పు వచ్చేవి.

1927-28 నుండి శాంతమ్మాళ్, తేనమ్మాళ్ ఆశ్రమంలో వంట చేయడం మొదలుపెట్టారు. అంతకుముందు అంతా చిన్నస్వామే వంట చేసి శ్రీభగవాన్‌కు భోజనం పెట్టేవారు. శ్రీ భగవాన్ భోజనం చేసిన తర్వాతే, చిన్నస్వామి అన్నం తినేవారు.

ఆశ్రమానికి వచ్చినవారు అందరూ, శ్రీభగవాన్ కటాక్షం



పొందాలనీ, అందులో ఎటువంటి తారతమ్యాలు వుండకూడదని చిన్నస్వామి గట్టిగా భావించేవారు. వచ్చినవారందరూ ఆశ్రమానికి ఏదో ఒక సేవ చేయాలని ఆయన కోరిక. ఒకరంటే ఇష్టమూ, మరొకరంటే అయిష్టమూ ఆయనకు వుండేది కాదు. తన కుటుంబ సభ్యులపట్ల గాని, మీదుమిక్కిలి తన మనుమలూ, మనుమరాళ్ళ పట్ల కూడా ఆయన ప్రత్యేకాభిమానం ఏదీ చూపేవారు కాదు. ఒకసారి, ఆశ్రమానికి రెండు సైకిళ్ళు కానుకగా ఇవ్వబడినవి. చిన్నస్వామిగారి కుమారుడు వెంకట్రామన్ ఒక సైకిల్ వాడడం మొదలు పెట్టారు. చిన్నస్వామికి ఈ విషయం తెలియగానే, ఆ సైకిల్‌ను వెనక్కి తెప్పించి, రెండు సైకిళ్ళూ కేవలం ఆశ్రమ అవసరాలకే వాడాలని నిర్దేశించారు. ఆయన తామరాకుమీద నీటి బొట్టులాగ సంచరించేవారే గానీ, ఆశ్రమ వ్యవహారాలు మటుకు అతి శ్రద్ధతో నిర్వహించేవారు. చిన్నస్వామి ఒక అత్యద్భుత కర్మయోగి. ఆశ్రమ పురోభివృద్ధికి ఆయన చక్కని పునాది వేశారు.

1939లో శ్రీభగవాన్ అనుమతితో, శ్రీరమణుల చేతులలో మోక్షం పొందిన తమ తల్లి సమాధిపై ఒక ఆలయ నిర్మాణానికి చిన్నస్వామి పూనుకున్నారు. కాలక్రమాన, ఆశ్రమానికి వచ్చే భక్తుల వసతికోసం కొన్ని గదులూ, వేదపాఠశాల, గోశాల, భోజనాల కోసం ఒక హాలూ, ఒక చిన్న వైద్య చికిత్సాలయమూ చిన్నస్వామి నిర్మించారు. ఇవన్నీ కూడా ఎంతో శ్రమతో, ఎంతో శ్రద్ధగా నిర్మింప బడినవి. డబ్బు కొరత ఎపుడూ వుండేది. కానీ, చిన్నస్వామి ఎంతో సమర్థవంతంగా ఆశ్రమాన్ని నిర్వహించేవారు. కొంతమంది భక్తులు ఇచ్చిన సలహా మేరకు, ఆయన దేవాలయ నిర్మాణానికి నిధులు

సమకూర్చుకునే నిమిత్తం ఉత్తర భారతానికి వెళ్ళడానికి సమాయత్తమయ్యారు. శ్రీభగవాన్ సమ్మతికోసం, వారి దీవెనల కోసం చిన్నస్వామి ఆయన దగ్గరకు వెళ్ళారు. ఆయన ఉద్దేశం తెలుసుకుని, శ్రీభగవాన్ కొంతసేపు మౌనంగా వుండి ఇలా అన్నారు: "ఇక్కడ ఏదో అమూల్యమైనది వున్నదని, అందరూ ఇక్కడికి వస్తున్నారు. నువ్వు ఎక్కడికో వెళ్ళడం దేనికి?" వెంటనే చిన్నస్వామి తన ప్రయాణం మానుకొన్నారు.

దేవాలయ నిర్మాణానికి అభ్యంతరం తెలిపినవారు కొందరు వుండగా, ఆశ్రమ ప్రచురణ కార్యకలాపాలకు అడ్డుపడినవారు మరికొందరు. "వారంతా స్వతంత్రులు, వారు వస్తారు, వెళతారు. కానీ, ఆశ్రమంలో వుండే మనం మాత్రం, ఆశ్రమ నిబంధనలకు కట్టుబడి వుండాలి" అనేవారు శ్రీ భగవాన్. ఈ విధంగా, సర్వాధికారి నిర్దేశించిన ఆశ్రమ కట్టుబాట్లకు ఆశ్రమవాసులతో పాటు తాను కూడా బద్ధులై వుండి, ఇతరులకు భావస్వాతంత్ర్యం శ్రీభగవాన్ ఇచ్చేవారు. కొంతమంది తమ తీవ్ర ఆక్షేపణాధోరణి మార్చుకోనపుడు, "చిన్నస్వామి ఏమన్నా గడ్డి పరక అనుకున్నారా? ఆయన ఇక్కడ సర్వాధికారి. ఆయన పదవిని గౌరవించి, మీరంతా ఆయన నిర్దేశించినట్లు నడుచుకోవాలి" అన్నారు శ్రీభగవాన్.

చిన్నస్వామి శ్రీభగవాన్‌కు పూర్తిగా విధేయులుగా వుండేవారు. ఇతరులతో ఎటువంటి పోలికా ఆయనకు నచ్చేది కాదు. "శ్రీభగవాన్ ఎటువంటి పోలికలకూ అతీతులు" అని చిన్నస్వామి అనేవారు. భక్తులందరికీ మంచి భోజనం వుండేలాగ, వారికి



కావలసినవి అన్నీ ఏర్పాట్లు అయ్యేలాగ ప్రత్యేక శ్రద్ధ తీసుకొనే వారు. ఆశ్రమానికి వచ్చే పిన్న వయస్కులు అంతా సౌఖ్యంగా వుండేటట్లు చూసేవారు. అమ్మ అలఘమ్మ ఆరాధన రోజు జరిగే నవరాత్రి వుత్సవాలకు, మహాపూజకు కావలసిన వివరాలు అన్నీ సొంతంగా చూసుకోవడంలో మహదానందం పొందేవారు. అందరికీ ప్రసాదం పంచిపెట్టడం అంటే ఆయనకు చాలా ఇష్టంగా వుండేది. వేదపాఠశాల పిల్లలంటే ఆయనకు మహాప్రేమ. వారికి ప్రత్యేకమైన భోజన వసతులు సమకూర్చి, పాలు, పండ్లు ఇచ్చే లాగ చూసేవారు. వారి దగ్గరే కూర్చుని పెరుగు వడ్డించేవారు. నవరాత్రి ఉత్సవాలు ముగిసాక, పూజా కార్యక్రమాలు బాగా చేసినందుకుగాను, వేదాలు చక్కగా పఠించినందుకుగాను బహుమానంగా వారికి కొత్త బట్టలు ఇచ్చేవారు.

తిరుచ్చుళిలో శ్రీభగవాన్ జన్మించిన ఇంటిని స్వాధీనం చేసుకొని, తమ తండ్రి పేరిట "సుందర మందిరం" అని పేరు పెట్టినందుకు చిన్నస్వామి శ్రీభగవాన్ భక్తుల గౌరవాన్ని, కృతజ్ఞతనూ చూరగొన్నారు. శ్రీరమణ భక్తులకు అది తీర్థయాత్రా స్థలంగా మారింది. తిరుచ్చుళిలో ఒక రైల్వే స్టేషన్, పోలీస్ స్టేషన్, బస్సు సౌకర్యాలు కూడా ఆయన ఏర్పాటు చేయించారు. అలాగే, మధురలో శ్రీరమణులకు ఆత్మసాక్షాత్కారమైన ఇంటిని కూడా ఖరీదు చేసి, రమణ మందిరంగా నామకరణం చేసారు. భక్తులకు అది ఒక సాధన మందిరంగా రూపొందింది.

చిన్నస్వామి ఆశ్రమ ధనాన్ని అనవసర ఖర్చులకు అసలు వినియోగించేవారు కాదు. తన స్వంత ఖర్చులకు అయితే అసలు

ముట్టుకునేవారు కాదు. తనకు వుండే బహుకొద్ది అవసరాలకు భక్తులపైనే ఆధారపడేవారు. తన బట్టలు తానే కుట్టుకునేవారు. ఎవరైనా కొత్తబట్టలు ఇచ్చేదాకా పాత దుస్తులే వాడుకునేవారు. చిరిగిపోయిన పాతబట్టలే వేసుకునేవారు, కానీ, కొత్తవాటి కోసం అడిగేవారు కాదు. ఎక్కడికైనా వెళ్ళవలసి వచ్చినపుడు, అత్యవసర మైతేనే ఒక సహాయకుడిని తీసుకు వెళ్ళేవారు.

ఆశ్రమంలో ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే ఎలా ఎదుర్కొనే వారో, ఒకసారి జయంతి సందర్భంలో జరిగిన సంఘటన తెలియ పరుస్తుంది. ఆశ్రమంలో బియ్యంగాని, కూరగాయలుగాని అసలు లేవు. మరునాడే జయంతి. వచ్చిన భక్తులకు భోజనం ఎలా పెట్టాలా? అని చిన్నస్వామి ఆందోళన పడుతున్నారు. ఒకవైపు భోరున వర్షం. ఆ వర్షంలో తడుస్తూ, ఆశ్రమం చుట్టూ తిరుగుతూ, 'ఈ సమస్య తీరేది ఎలా?' అని తనలో తాను మథనపడు చున్నారు. ఆ వేళ బాగా చీకటిపడ్డాక, ఆశ్రమానికి బియ్యం, కూరగాయలు, ఇతర వంట దినుసులతో నిండిన ఒక ఎద్దుబండి వచ్చింది. వస్తువులు అందజేసి బండివాడు వెళ్ళిపోయాడు. చిన్నస్వామిని నిద్ర లేపారు. ముందు చాలా సంతోషించారు. కానీ, ఆయనకు మళ్ళీ దిగులు పట్టుకుంది. "కూరగాయలు అన్నీ ఎవరు తరుగుతారు?' అనేది ఆయన సమస్య. ఇదంతా చూస్తున్న శ్రీ భగవాన్, పాతహాలులో వున్న అందరినీ తన కర్రతో లేపి, "పిచ్చై ఇబ్బందిలో వున్నాడు, రండి. అందరూ కూరలు తరుగుదాం" అని కదిలించారు. *(సశేషం)*



# పంచకోశ విశ్లేషణ

(మౌంటెన్‌పాత్, జనవరి-మార్చి, 2019 (సంపుటి 56, సంచిక 1)లో 'పంచకోశ వివేక'అనే శీర్షికతో ప్రచురించబడిన జాన్‌గ్రైమ్స్ గారి 'కీవర్డ్' యొక్క అనువాదం)

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

## ఆధ్యాత్మికతకు ప్రాథమిక విధులు

అద్వైత వేదాంత తత్వశాస్త్రంలో ఆధ్యాత్మిక సాధకుడు సూటియైన జ్ఞానమార్గాన్ని అనుసరించడానికి నాలుగు ప్రాథమిక, అపేక్షణీయమైన విధులను గురించితరచు చర్చించబడ్డాయి. ఆ యోగ్యతలు: 1) శాశ్వతం, అశాశ్వతమైన వాటి మధ్య తేడాలను గుర్తించడం. 2) ఈ లోకం, లేదా పరలోకంలో చేసిన తమ చర్యల ఫలితాలను అనుభవించాలన్న కోరిక ఏ మాత్రమూ లేకపోవడం. 3) నిశ్చలత్వం, శాంతం, భోగేంద్రియాల పట్ల విముఖత, ఓర్పు, ఏకాగ్రత, నమ్మకం - ఈ ఆరు సుగుణాలను పుష్కలంగా కలిగి వుండడం, 4) ముక్తి కోసం ప్రగాఢమైన తపన చూపడం.

శాశ్వతము, అశాశ్వతమైన వాటి మధ్య తేడాలు గుర్తించడం వ్యక్తి యొక్క యథార్థ స్వభావాన్ని తెలియజెప్పడానికి ఉపయోగ పడుతుంది. భగవాన్ రమణుల ఉద్దేశంలో వ్యక్తి సహజంగా శరీరం, ఇంద్రియాలు, మనసుకు పరిమితుడై వుంటాడు. కాని ఇవేవీ ఆత్మ కానేరవు. అజ్ఞానం కారణంగా, వ్యక్తులకు తమ నిజ స్వభావం తెలియకపోవడమే గాకుండ, శరీరం, మనసు, మొదలైనవే ఆత్మ అన్న తప్పుడు అభిప్రాయం వుంటుంది. ఈ

కోశములు (పొరలు) అన్నవి అనాత్మలు. ఆత్మ వాటి నుండి వేరైనదని గుర్తించాలి.

'ఆత్మ' లేదా 'బ్రహ్మన్' మానసికంగా భావించబడే వస్తువు కాదు. అతీతమైన ఊహ కూడ కాదు. అది ఎల్లప్పుడూ ప్రత్యక్షంగా వుండేది. పంచకోశాలను (ఐదు పొరలను) విశ్లేషిస్తే ఆత్మ మాత్రమే శాశ్వతంగా వుండేదనీ, మిగత ఆ ఐదు పొరలు మార్పు చెందుతూనే వుంటాయనీ తెలుస్తుంది. స్థూలమైన, బాహ్యమైన తక్కువగా మాత్రమే వ్యాప్తి చెందే ఈ పొరలు, ఎప్పుడూ సూక్ష్మంగా, అంతరంగా వుండి వ్యాప్తి చెందే దానికంటే సత్యదూరాలని కూడ అర్థమౌతుంది. తద్వారా ఆత్మ అతి సూక్ష్మమైనదిగా, అంతరంలో వున్నందున అదే నిత్యమని గ్రహించగలం.

భౌతిక శరీరం అతి స్థూలమైనది (అన్నమయకోశం). చిట్ట చివరి లోపలి పొర (ఆనందమయ కోశం) లలితంగా వుంటుంది. ఈ ఐదు పొరలలోను, అశాశ్వతమూ, వస్తు ప్రాధాన్యతా తత్వం కనిపిస్తాయి. కాని వీటన్నిటికీ మూలమైన ఆత్మ అతి సూక్ష్మమైనదీ, చాలా ఎక్కువగా వ్యాప్తి చెందే స్వభావం కలది కూడ. ఆత్మ తెలివికి అందే వస్తువు కాదు. అది స్వయం ప్రకాశమైనది. దానికి ఏ ఇతర వెలుగూ అక్కరలేదు. అది అనుభవంలోకి వచ్చే వస్తువు కాదు. వస్తు ప్రాధాన్యతగల ఐదు పొరలను ప్రక్కకు తొలగించిన తరువాత మిగిలేది శుద్ధ చైతన్యము, ఎరుక. వస్తు సంబంధిత నామ, రూపాలను మొత్తం తొలగించి పరిశీలించిన తరువాత ఏమీ లేదని చెప్పడానికి కూడ, అలా చెప్పగల చైతన్యం అవసర



మౌతుంది. అందుకే ఈ లలితమూ, సూక్ష్మమూ అయిన ఆత్మ తొలగింపబడలేనిది.

## పంచకోశ వివేకం

పంచకోశ వివేకమన్న పద్ధతి తైత్తిరీయ ఉపనిషత్తు, వివేక చూడామణి, పంచదశి మొదలైన వాటిలో పేర్కొనబడింది. ఈ పద్ధతిలో వ్యక్తిని ఐదు కోశాలలో విశ్లేషించడం జరుగుతుంది: అన్నమయకోశం (ఆహార సంబంధిత పొర); ప్రాణమయకోశం (ప్రాణవాయువు, శక్తి సంబంధిత పొర); మనోమయకోశం (మానసిక సంబంధ పొర); విజ్ఞానమయకోశం (బుద్ధికి సంబంధించిన పొర); ఆనందమయ కోశం (ఆనందానికి సంబంధించిన పొర). ఉల్లిపాయ మీద కనిపించే పొరల లాగ, తరువాతి ప్రతి పొర, అంతకు ముందున్న పొరను పూర్తిగా కప్పి, వ్యాప్తి చెందే గుణాన్ని కలిగి వుంటుంది. ఈ పద్ధతి ఆత్మకు సంబంధించిన జ్ఞానాన్ని మనకు తెలుపగలుగుతుంది. ఎందుకంటే ఈ విశ్లేషణ నిశితమయ్యేకొద్దీ, అది మనల్ని తెలిసినదాని నుండి తెలియని దానిని గ్రహించడానికి దారి చూపుతుంది.

ఆత్మను కప్పిపెట్టే ఈ ఐదు పొరలను విశ్లేషిస్తే, ఆత్మ ఈ అయిదు పొరల్లోనికి వ్యాపించివున్నట్లు వ్యక్తమౌతుంది. ఏది సూక్ష్మమో ఏది అంతరంగంలో నెలకొని వున్నదో, అది చుట్టూ వున్న అన్నింటిలోకి వ్యాప్తి చెంది వుంటుంది. పైన వున్న అయిదు పొరలు, ఆత్మను కప్పిపెట్టి వున్నాయన్నట్లు అనిపిస్తుంది. కాని,

నిజానికి ఆత్మను ఏదీ కూడ కప్పలేదు. అయితే ఈ పొరల మీద అతి ప్రాముఖ్యతను చూపడం వల్ల అవి అలా ఆత్మను కప్పి పెట్టినట్లుగా ఒక అభిప్రాయాన్ని కలిగిస్తాయి. మామూలుగా అన్నిటి కంటే బాహ్యంగా వున్న మొదట పొరయే తమ ఆత్మ అని వ్యక్తులు సామాన్యంగా భావిస్తారు. కాని ఆ పొర తరువాత విచ్ఛిన్నమయ్యే జడపదార్థంలో చేయబడింది.

## వ్యక్తికంటే శరీరం వేరు

ఈ భౌతిక శరీరం తాను కాదని వ్యక్తి నమ్మడానికి ఎన్నో కారణాలున్నాయి. అది వ్యక్తి చైతన్యం యొక్క ఒక వస్తువు మాత్రమే. మనం సాధారణంగా శరీరాన్ని ఒక వస్తువు రూపంలో చూస్తాము గనుక వ్యక్తిగా మనం శరీరానికి భిన్నమైన వారమని అర్థమవుతుంది. అంటే వ్యక్తిగా మనం శరీరం కంటే వేరు. ఇక రెండవది, చనిపోయినప్పుడు శరీరం మిగిలి వుంటుంది గాని వ్యక్తి చచ్చి వెళ్ళిపోయాడని అంటాము. శరీరంలో వున్నదేదో ఇక లేదు. అందుకే, శరీరానికి వేరుగా మరేదో ఒక 'నేను' వుందని విశదమౌతోంది.

'నా' శరీరం, 'నా' వెంట్రుకలు అని మనం అంటుంటాం. 'నా' అన్నది పురుష బోధక సర్వనామం (పర్సనల్ ప్రొనౌన్). అది అధీనంలో వున్నదానిని సూచిస్తుంది. శరీరాన్ని ఎవరు కలిగి వున్నారు? ఎవరి అధీనంలో వుంది? "నేను లావుగా వున్నాను" లేదా "నేను సన్నగా వున్నాను" అనే ప్రకటనలు 'ఆహార సంబంధ పొర'కు వర్తించే అంశాలను ఉద్దేశించి చెప్పబడేవి మాత్రమే.



అంటే దాని అర్థం 'వ్యక్తి' అంటే వ్యక్తి యొక్క శరీరమనడం సరికాదు.

జడమైన ఆహారసంబంధిత పొర ఒక 'శక్తి పొర' చేత పోషింపబడి, శక్తివంతం చేయబడుతుంది. శారీరక కార్యక్రమాలన్నింటికీ శక్తి అవసరం. వాటివాటి పనులను నిర్వర్తించడానికి శరీరం, మనసుకు ఆ శక్తి కావాలి. ఉద్దేశపూర్వకంగా చేసే పనులకు (సంకల్పిత క్రియలకు) విరామ సమయాలుంటాయి. కాని అసంకల్పిత క్రియలు నిరంతరంగా సాగుతుంటాయి. 'శ్వాసక్రియ' గుండె పని చేయడం, రక్తప్రసరణ, జీర్ణక్రియలు ఎప్పుడూ జరుగుతూనే వుండడం వల్ల వాటికి శక్తి అవసరం.

ప్రాణం శరీరాన్ని వదిలి వెళ్ళిన క్షణం లోనే అన్ని శారీరక క్రియలు ఆగిపోతాయి. అందుకే ప్రాణమయకోశం ఎంత ముఖ్యమైనది అయినప్పటికి, అది ఒక పొర మాత్రమే! జడమైనది గనుక అది మన ఆత్మ కాదు. దానికి చైతన్యంతో సంబంధం లేదు. ప్రాణానికి బుద్ధి కుశలతగాని, చిత్తవృత్తిగాని వుండవు. ఇక ప్రాణావశ్యకమైన శక్తి సూటిగా మన మనసుచేత ప్రభావితమై వుంటుంది. ఉపదేశసారంలో రమణమహర్షి 'మనసు, ప్రాణము, ఒకే చెట్టు యొక్క రెండు శాఖల'ని చెప్పారు. మనిషి యొక్క మనసు అనబడే పొరను 'మనోమయకోశం' అంటారు. మనసు ఆలోచనల మూట తప్ప మరేమీ కాదు.

## మనం ఎవరో ఆలోచనలు నిర్ణయిస్తాయి

ప్రతి ఆలోచన గొప్ప సహజ, అంతర్జాతమైన శక్తిని కలిగి

వుంటుంది. వ్యక్తి యొక్క దేహధర్మం, భావోద్రేకాలు, ప్రతి స్పందనలు, సంబంధ బాంధవ్యాలను ప్రభావితం చేస్తుంది. సూక్ష్మంగా చెప్పాలంటే మనం నిజంగా ఎవరో మన ఆలోచనలు నిర్ణయిస్తాయి. 'బంధం', 'విముక్తి'ల మూలాలు విజ్ఞానమయ కోశంలో వుంటాయి. బుద్ధికి సంబంధించిన ఈ పొర నిర్ణయాలు చేసే శక్తిని కలిగి వుంటుంది. ఈ సంకల్పిత నిర్ణయాలే వ్యక్తి యొక్క ఆలోచనలు, కోరికల తీరుకు బాట వేస్తాయి. ఆనంద మయ కోశం బుద్ధిని ఉత్తేజ పరుస్తుంది.

ప్రపంచంలో ప్రతి ఒక్కరికి సంతోషమయమైన జీవితం, పూర్తిగా ఆనందం కావాలన్న ఒక మౌలికమైన కోరిక వుంటుంది. ప్రతీ చర్య వల్లనూ సంతోషం కలగాలన్న ఉద్దేశంతో వుంటారు. ఆ కోరిక కారణంగానే చురుకుగా వుండి పనులను నిర్వహిస్తుంటారు. రమణమహర్షి, "సుఖం అనబడేదే ఆత్మ యొక్క నిజ స్వభావం. సంపూర్ణ ఆనందం తప్ప మరి ఆత్మ అంటూ వేరే ఏదీ లేదు. ఆనందం అనబడేది మాత్రమే అసలైన ఉనికి. ఆ సత్యాన్ని గ్రహించి, ఆత్మలో స్థిరంగా వుండడంతో శాశ్వతమైన పరమానందాన్ని అనుభవించవచ్చు" అంటారు.

ఆనందమయకోశమే విజ్ఞానమయకోశాన్ని పోషిస్తుంది. ఆనందం అనుభవించాలన్న కోరికయే విజ్ఞానమయకోశాన్ని ఉత్తేజితం చేస్తుంది. మౌలికంగా ఆనందం అన్నది ఒకటే అయిన ప్పటికి, దాని యొక్క తీక్షణత, లేక స్థాయిలను బట్టి ప్రియము, మోదము, ప్రమోదము అని విభజించారు. ఒక ఇష్టమైన వస్తువు



లేదా వ్యక్తిని గురించి ఆలోచించినప్పుడు కలిగే అనుభూతిని 'ప్రియము' అంటారు. ఇష్టమైన వ్యక్తి లేదా వస్తువు దాపులో వున్నప్పుడు కలిగే అనుభూతిని 'మోదము' అంటారు. 'ప్రమోదము' అన్న అనుభూతి వ్యక్తి తాను ప్రేమించే వస్తువుతో కూడి వున్నప్పుడు కలుగుతుంది. కాని ఇది కూడ ఆనందంలో ఆఖరి మెట్టు అనడానికి వీలు లేదు. వారు ఇంకా ఆనందాన్ని అన్వేషిస్తూ, ఆ విధంగా బంధితులుగానే వుంటారు.

రమణులు "మీరే అతి ఉన్నతమైన ఆనందం అని నిజంగా తెలుసుకొనడం ఆఖరి మెట్టు. మిగత అన్ని రకాలైన సుఖ సంతోషాలు, ఖుషీ, ఆనందం అనే భావాలు, శిఖరాగ్రంలోని అసలైన పరమానందం యొక్క పరివర్తనాలు మాత్రమే. అదే నీ నిజస్వరూపం" అంటారు. ఆనందాన్ని ఇచ్చే వాటిని అంటిపెట్టు కుని వుంటే, అది వ్యక్తి యొక్క అసంపూర్ణతను సూచిస్తుంది. అంటే ఆనందమయకోశం కూడ అసలైన మౌలిక స్థితి కాదు. పుష్కలంగా ఆనందాన్ని అనుభవించడం మోక్షం కాదు. ఆఖరు దశ 'నేను అది' అన్న సత్యాన్ని నిష్కర్షగా గ్రహించడమే. "విముక్తి" అన్నది మన యథార్థ స్వభావం. 'నేను అది'. ఆ జ్ఞానాన్ని పొందిన వాడు విముక్తుడు. అన్ని నామ, రూపాలకు ఆధారంగా వున్నదే అసలైన సత్యం. అది పరిమితం లేనిది. అది బంధితమై వుండదు. నిత్య సత్యమైనందువల్ల అన్ని అసత్యాలకు అది భిన్నమై వుంటుంది" అని రమణ మహర్షి చెప్పారు.

# రమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# శ్రీ నటేశన్

అనువాదం: జి. శ్రీహరి రావు

(శ్రీ భగవాన్‌కు పాతిక సంవత్సరాలు అవిరామంగా కురకర్మ చేసిన మహా అదృష్టవంతుడు శ్రీ నటేశన్. శ్రీ భగవాన్‌కు చిరకాల భక్తుడు. 'Lest we forget' అన్న శీర్షికతో శ్రీ రమణాశ్రమ ఆంగ్ల ప్రచురణ "surpassing Love and Grace" లో ముద్రితమయిన వారి జీవిత విశేషాల స్వేచ్ఛానువాదము యీ క్రింద పొందుపరచబడింది. శ్రీ నటేశన్‌కు శ్రీ భగవాన్ పట్ల అపారమైన పూజ్యభావమూ, శ్రీ భగవాన్‌కు ఆయన పట్ల వున్న వాత్సల్యమూ, కరుణ యీ రచనలో మనకు కళ్ళకు కట్టినట్లు కనబడతాయి.)

“పోలూరు తిరువణ్ణామలకు ఉత్తరాన వున్న చిన్న గ్రామము. శ్రీ నటేశన్ పోలూరు వాస్తవ్యుడు. అతని తండ్రి శ్రీ అరుణాచలేశ్వరునికి మహాభక్తుడు. ప్రతి తమిళ మాసపు మొదటిరోజున, అరుణాచల గిరిప్రదక్షిణ చేయడానికి, ఆయన 20 మైళ్ళు నడిచి వచ్చేవారు. వృద్ధాప్యంలో ఆయన గిరి ప్రదక్షిణ చేస్తూనే తనువు చాలించారు. తన తండ్రి సంపాదించిన పుణ్యం వల్లనే శ్రీ భగవాన్‌కు సేవ చేసుకునే భాగ్యము తనకు కలిగిందని శ్రీ నటేశన్ గాఢంగా నమ్మేవారు.

నటేశన్ తండ్రిని కోల్పోయిన తరువాత అతనిని, పినతండ్రి సుబ్బరాయన్ పెంచుకున్నారు. శ్రీ భగవాన్‌ను సుబ్బరాయన్ మొదటగా గురుమూర్తంలో చూశారు. ఆయన జుట్టు పెరిగి జడలు కట్టిపోయి వుండటం చూసి, క్షౌరం చేయటానికి అనుమతి కోరారు. శ్రీ భగవాన్ మౌనంగా వుండటం చూసి, శ్రీ భగవాన్



అనుమతి నిరాకరించారనుకున్నాడు. కానీ తరువాత కొందరు భక్తులు శ్రీ భగవాన్‌కు క్షౌరం చేయించాలని కోరుకొని శ్రీ సుబ్బరాయన్‌ను పిలిచారు. ఆయన సంతోషంగా ఒప్పుకున్నారు. అప్పటినుండీ క్రమం తప్పకుండా శ్రీభగవాన్‌కు క్షౌరం చేయసాగారు. తనకు వయస్సు పెరిగిపోయి, రాలేని స్థితికి చేరినప్పుడు, ఆ సేవను సాగించమని, నటేశన్‌ను ప్రోత్సహించారు సుబ్బరాయన్. నటేశన్ సంతోషంగా ఒప్పుకొని, ప్రతి పౌర్ణమి రోజునా శ్రీభగవాన్‌కు క్షౌరం చేయడం మొదలు పెట్టారు.

క్షౌరం చేయవలసిన రోజున నటేశన్ ఉదయమే స్నానం చేసి, ఒంటికి విభూతి రాసుకుని, 9 గంటలకల్లా ఎంతో భక్తి ప్రపత్తులతో శ్రీ భగవాన్ దగ్గరకు వచ్చేవారు. ఆ సమయానికి శ్రీ భగవాన్ తమ ఉదయపు వ్యాహ్యాళి ముగించి తిరిగి వచ్చేవారు. నటేశన్‌ను చూడగానే, శ్రీ భగవాన్ తమ మోకాళ్ళకు నూనె రాసుకొని, నెమ్మదిగా గోశాలవైపు నడిచేవారు. గోశాలలో శ్రీ భగవాన్ క్షురకర్మ నిమిత్తము ప్రత్యేకంగా ఒక స్థలం కేటాయింపబడేది. ఆ స్థలాన్ని శుభ్రపరిచి ముగ్గులు వేసి వుంచేవారు. క్షౌరం మొదలు పెట్టే ముందు, నటేశన్ శ్రీ భగవాన్‌కు సాష్టాంగ నమస్కారం చేసి తన పని ఆరంభించేవారు. క్షౌరం అయ్యేంత వరకూ నిశ్శబ్దంగా వుండి, తరువాత శ్రీభగవాన్‌తో క్లుప్తంగా నాలుగు మాటలు మాట్లాడేవారు.

ఒకసారి శ్రీ నిరంజనానంద స్వామి నటేశన్‌ను పిలిచి, తన పనిని ఒక గంటముందు మొదలు పెట్టమన్నారు. వేసవి కాలం ఎండల్లో, శ్రీభగవాన్‌కు అది సౌకర్యంగా వుంటుందని ఆయన భావన. వారి ఆదేశం ప్రకారం నటేశన్ ముందుగా వచ్చారు.

ఆయన ముందు రావడాన్ని శ్రీ భగవాన్ ప్రశ్నార్థంగా చూశారు. శ్రీ నిరంజనానంద స్వామి ఆదేశం గురించి వివరించగా శ్రీ భగవాన్ ఎండవేడి గురించి ఆలోచించనక్కరలేదనీ అంతకు ముందు సమయం ప్రకారమే రావలసిందిగా సూచించారు.

శ్రీ నటేశన్ పెళ్ళిళ్ళకూ, యితర శుభకార్యాలకూ నాదస్వరం వాయించే వారు. ఒకసారి ఆయన శ్రీ భగవాన్‌కు క్షౌరం చేస్తుండగా, సుబ్బరాయన్ వచ్చి పని అయ్యాక ఒక శుభకార్యానికి వెళ్ళి నాదస్వరం వాయించాలని చెప్పారు. ఆ మాట విన్న శ్రీ భగవాన్, "నటేశన్ మధ్యాహ్నం వెళ్ళి నాదస్వరం వాయించాలట. ఉదయం నుండీ అతను యేమీ తినలేదు, అన్నారు. దగ్గరే వున్న పరిచారకులు, శ్రీ భగవాన్ ఉద్దేశాన్ని గ్రహించి, వంటశాల నుండీ నటేశన్ కోసం భోజనం తెచ్చి యిచ్చారు. అప్పటి సాంఘిక పరిస్థితుల బట్టి, మంగలిపని చేసే వారిని అంటరాని వారిగా భావించి, అందరూ భుజించిన తరువాత గానీ, వాళ్ళకు అన్నం పెట్టే వారుకాదు. శ్రీ భగవాన్ కరుణకు కరిగిపోయిన నటేశన్, అలాంటి ప్రేమ శ్రీ భగవాన్‌కే సాధ్యమని చెప్పుకొని తన్మయం చెందేవారు. తరువాతి రోజులలో యీ సంఘటనను గుర్తు చేసుకొని కళ్ళల్లో నీరు పెట్టుకొనేవారు. శ్రీ భగవాన్ భక్తులందరినీ సమానంగా చూసేవారనీ, ఎవ్వరూ ఆకలితో మరలి పోకుండా చూసేవారనీ మురిసి పోతూ చెప్పేవారు.

శ్రీ భగవాన్‌కు సేవ చేయడమే తన అతి ముఖ్యమైన బాధ్యతగా భావించేవారు శ్రీ నటేశన్. తన నెలసరి కార్యక్రమాన్ని ఎప్పుడూ భంగపరిచేవారు కాదు. ఒకసారి నటేశన్ సోదరుడు జబ్బుపడి ప్రాణాపాయ స్థితిలో వున్నారు. బంధువులతో తన



పరిస్థితి వివరించగా, వారు ఎంతో విజ్ఞతతో, ముందు తిరువణ్ణామల వెళ్ళి శ్రీ భగవాన్ సేవ ముగించమని సలహా యిచ్చారు. మరుసటి రోజు, శ్రీ భగవాన్‌కు క్షౌరం చేయడం పూర్తి కాగానే, ఒక బంధువు వచ్చి, నటేశన్‌తో తన సోదరుడు మరణించాడనీ, కర్మకాండ చేయడానికి ఆయన వెంటనే రావాలనీ తెలియపరిచాడు. అతని మాటలు శ్రీ భగవాన్ విన్నారు. "నటేశన్ సోదరుడు చనిపోయాడట, ఇతను వెంటనే పోలూరు వెళ్ళాలి. పొద్దుట నుండీ ఏమీ తిని వుండడు. వెళ్ళటానికి దగ్గర డబ్బులు వున్నవో లేవో?" అన్నారు శ్రీ భగవాన్. శ్రీ భగవాన్ మాటలు విన్న పరిచారకుడు రామకృష్ణస్వామి, వంటశాలకు వెళ్ళి కొన్ని తిను పదార్థాలు తెచ్చారు. కానీ నటేశన్‌కు ఏమీ తినబుద్ధికాక, మూడు కప్పులు కాఫీ తాగారు. ఆయన వూరు వెళ్ళడానికి 5 రూపాయలు యిచ్చారు ఆశ్రమం వారు.

ఒకసారి శ్రీ భగవాన్ కొండమీద వుండగా, నటేశన్ వారికి సాష్టాంగ నమస్కారం చేశారు. "ఇక్కడ యెందుకు?" అన్నారు శ్రీ భగవాన్. తమకు గోశాలలో నమస్కరిస్తే చాలనీ, యతరత్రా తన భక్తి ప్రకటించనవసరము లేదన్నది శ్రీ భగవాన్ ఉపదేశంగా గ్రహించారు శ్రీ నటేశన్.

ప్రతి నెలా, క్షౌరం చేయడం పూర్తి అయిన తరువాత కొద్ది నిముషాలు నటేశన్ శ్రీ భగవాన్‌తో ఏకాంతంగా సంభాషించేవారు. ఆ సమయంలో వారి మధ్యకు యెవ్వరూ వచ్చేవారు కాదు. ఆ క్షణాలలో శ్రీ భగవాన్ కరుణాపూరితమైన మాటలు వినడమే, తన జీవితంలో అత్యంత ఆనందభరిత సన్నివేశాలని నటేశన్ భావించేవారు.

# Means Is As Important As The Goal

Dr.K.Subrahmanian (Talk 59A)

We attend a lot of discourses, talk to a lot of people, visit various *punyasthalas* and temples, meet many sages and saints - all with the hope that by doing these things, we will get *shanti* or peace. We feel that we would get some new advice, something that we have not heard before. We do get peace of mind occasionally when we listen to a discourse or visit a sadhu. This lasts for some time and again we get restless and we visit another person. But do we stop to find out the basis or reason for this occasional happiness? Do we ask ourselves, "Why am I happy today?" When we are happy, we don't ask such questions. We enjoy being happy and that is the end of it. After reading a lot of books and after listening to a number of discourses, we stop learning anything new. After a certain age,what we learn is permutations and combinations of what we already know. What we have learnt at the age of ten becomes the basis of all our knowledge. Why is it? Because we are not practicing what we were told between the ages of five and ten.

Even the Bhagavad Gita is not going to tell you anything new that you have not learnt before the age of ten. After ten, you get involved in a number of activities and tend to forget the basics; you do not put into practice what was learnt, and therefore, you are not learning anything new. When you read the Gita, does it tell you to be dishonest, impolite, untruthful? No. So, in a sense, we are interested in finding out if we can be happy even though we are dishonest, insincere, impolite and unkind! We don't really believe that a person can be happy by being honest, by being kind. We



try to find out a method where we can be happy even though we are unkind, dishonest, etc. That is the main problem. The moment I accept I am dishonest, I am unkind, I am ungrateful, I can become honest, kind and grateful! The problem is we don't want to face ourselves, we want to face others. All our problems are a result of this. We always feel that so and so is dishonest, and yet he is successful. But, have we really asked that other person whether he is happy? Only this is important.

Now, consider the case of someone who owns nothing; who does not even know when he will get his next meal. This person does not ask anyone to come to him, and yet people flock to him. That is because you find peace of mind when you are with him. You may not understand all that he says, you may even think that his advice is not practical. We think the guru is all right in the puja room, but not all right outside the puja room. But still you go to him because you think that it is good to have a guru. You feel whatever problems that you have, he will sort them out. You think, "However bad I may be, he can get me out of a bad situation." This is our attitude towards the guru. We don't want to do what the guru wants us to do, but because we think that he is full of grace and compassion, we would like him to get us out of a bad situation. This is not *guru bhakti*. We do not follow the guru's advice because we feel he asks us to do impossible things. The guru says that we must do the right thing, irrespective of the circumstances- and this make us feel that the guru is 'impractical'!

